క్లుప్తంగా

నేడు పట్టణంలో రీ సర్వే ప్రారంభం

అద్దంకి: జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా నేటి ఉదయం 11 గంటలకు రీ సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరై డ్రోన్ ఎగరేసి ప్రారంభిస్తారని మునిసిపల్ కమిషనర్ ఇ. రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు 20వ వార్డులో ఖాళీ స్థలానికి ప్రహరీ నిర్మాణం కోసం భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

28న సీనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

చినగంజాం: రాష్ట్ర స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు స్త్రీ, పురుషుల ఎంపిక కార్యక్రమం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి పి. జాన్ బాబు తెలిపారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీ స్టేడియంలో జరుగు సీనియర్ స్టేట్ అథ్లెటిక్స్ మీట్ పురుషులు, స్త్రీలకు మే 5వ తేదీ ఉదయం 9 గంటలకు జరుగనున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 వ తేదీ చినగంజాం సోపిరాల తహసీల్దార్ కార్యాలయం ఎదురు శివాలయం గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు సీనియర్ పురుషులు, స్త్రీలకు సెలక్షన్ మీట్ అథ్లెటిక్స్ సెలక్షన్ రికార్డు ప్రకారం ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, రెండు ఫొటోలు తీసుకొని రావాలని తెలిపారు. క్రీడాకారులు తమ వివరాలను కె. అనంత కుమార్ రెడ్డి 8978482329 నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం బి.సుబ్బారావు సూచించారు. బుర్లవారిపాలెం లోని స్త్రీశక్తి భవనంలో బుధవారం మాట్లాడుతూ పొదుపు మహిళలకు ప్రభుత్వం రూ.54 కోట్లు కేటాయించగా మొదటి, మూడో విడత ఆసరా సాయం పొదుపు మహిళల బ్యాంకు ఖాతాలకు జమచేశారన్నారు. సీసీ, సీవీలు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

30 లోపు దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ: వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద కొత్తగా రిజిస్ట్రేషన్ చేసేందుకు అర్హులు ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారిని ఎస్‌వీపీ కుమారి తెలిపారు. గతంలో రైతు భరోసా, పెట్టుబడి సాయం అందదని రైతులు ఆర్బీకేల్లో వీఏఏలకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం రాయితీ అందించి పెట్టుబడి సాయం పొందవచ్చని కోరారు.

సేవా భావంతో అందరికీ ఆనందం



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వేటపాలెం: విద్యార్థి దశలోనే సేవాభావాన్ని పెంపొందించు కోవాలని ప్రిన్సిపాల్ ఎం. వేణుగోపాలరావు సూచించారు. సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. జాతీయ సేవా విభాగం ప్రోగ్రామ్ కన్వీనర్ డి. జ్యోతి స్వరూప్, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ



బల్లికురవలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వామపక్షనేత

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో వ్యవసాయ కూలీలు, కార్మికులు పూటగడవక విలవిలలాడుతున్నారని వామపక్షనేత తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బల్లికురవలోని ఎస్టీ కాలనీలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. వైద్యులు శ్రీదేవి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని 14 సబ్ సెంటర్లలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎండలు అధికంగా కాస్తున్నందున గ్రామాల్లోని చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యాలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాక్సిన్లను క్రమం తప్పకుండా వేయాలన్నారు. వేసవికాలంలో ప్రజలకు ఓఆర్ఎస్ ద్రావణాల ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న చైతన్య

మేదరమెట్ల: ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. అందుకే ఆక్రమణలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య కోరారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల సెంటరులో ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో బుధవారం ఆర్అండ్‌బీ డీఈ నరసింహారావుతో కలిసి చైతన్య పర్యటించారు. ఆక్రమణలకు గురైన ప్రదేశాన్ని మార్కింగ్ చేసి అక్రమంగా ఆక్రమించుకున్న రోడ్డు లోని నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. బస్టాండ్ ముందు భాగంగా ఉన్న గోడకు ఆనుకొని అక్రమంగా నిర్మాణాలు చేయడం చిరువ్యాపారాలు చేసుకునే వారికి వాటిని అద్దెలకు ఇచ్చి తద్వారా వచ్చిన సొమ్మును తమ జేబుల్లో నింపుకోవడం జరుగుతుందని, ఆ ప్రాంతంలో వాహనాలు వెళ్ళాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారన్నారు. నిర్మాణాలను తొలగించి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నవరత్నాలతో నవశకానికి నాంది



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న కరణం వెంకటేష్

చీరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నవరత్నాల పథకాలతో నవశకానికి నాంది పలికారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం చీరాల మండలం బుర్లవారిపాలెం, పెర్లవారిపాలెం గ్రామ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని తగు పరిష్కారం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. ఎంపీడీఓ నేతాజీ, ఏపీఎం సుబ్బారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, బుర్ల సాంబశివరావు, వ్యవసాయ సలహామండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ గవిని నారాయణ, బుర్ల మురళి, బోయిన స్వాములు, మల్లారపు యేసురత్నం, బుర్ల రాంబాబు, గవిని వెంకటేశ్వరరావు, మచ్చా సువార్త, షేక్ మస్తాన్, బి.నాగరాజు, కట్టా గంగయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సతీష్‌కుమార్‌కు ఉత్తమ ఎంపీటీసీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎంపీటీసీ సతీష్ కుమార్

యద్దనపూడి: మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్‌కుమార్‌కు పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంపీటీసీ అవార్డు అందజేశారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రామ స్వరాజ్య సాధన సమితి ప్రధాన కార్యదర్శి, చైర్మన్ జి. వీరభద్రాచారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో నేతాజీ

చీరాల టౌన్: మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రంతో ఉపశమనం కలుగుతుందని ఎంపీడీవో నేతాజీ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ఎంపీడీవో ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మినరల్ వాటర్‌తో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వేసవికాలం పూర్తయ్యేంత వరకు మంచి నీటి సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, మండల పరిషత్ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

చీరాల అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఎనిమిది వలంటీర్ల పోస్టులకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తం 39 మంది అభ్యర్థులకు గాను 27 మంది హాజరయ్యారు. వీరిలో ప్రతిభ ఆధారంగా ఎనిమిదిని ఎంపిక చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు మే 3న ఉత్తర్వులు అందించనున్నట్లు తెలిపారు.

హెల్త్ సెంటర్‌లో విస్తృత సేవలు



బూదవాడలో చిన్నారికి వాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

జె.పంగులూరు: అన్ని రకాల వైద్య సేవలను హెల్త్ సబ్ సెంటర్ల ద్వారా అందిస్తున్నారు. బూదవాడ గ్రామంలోని హెల్త్ సెంటర్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. హెల్త్ సెంటర్ పరిధిలో మొత్తం 12 మంది బాలింతలు, 26 మంది గర్భిణులు, ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులు 180 మంది, కిశోర బాలికలు 172 మంది ఉన్నట్లు సచివాలయ ఏఎన్ఎం కట్టా జ్యోతి తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రస్తుతం వ్యాక్సిన్ వేస్తున్నామని, ఈ వ్యాక్సిన్ ద్వారా పసిపిల్లలకు సంక్రమించే అనేక రకాల వ్యాధులు దూరం అవుతాయన్నారు. స్కూల్ పిల్లలకు ఐరన్ మాత్రలు అందిస్తూ, హెచ్‌బీ టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న కంటి వెలుగు పథకం ద్వారా చిన్నపిల్లలకు కంటి పరీక్షలు నిర్వహిస్తూ అందుకు అవసరమైన సూచనలు సలహాలు అందిచటం జరుగుతుందని తెలిపారు. నెలకు రెండు సార్లు 104 వాహనం గ్రామానికి వస్తుందని, వాహనంలో ప్రతి నెలా రెండో శుక్రవారం, నాలుగో శనివారం వస్తుందని తెలిపారు. సి.హెచ్‌ఓ ఎండ్లూరి స్వప్నలత మాట్లాడుతూ సబ్ సెంటర్ పరిధిలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



కారంచేడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

కారంచేడు: మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఈ ఏడాది నిర్మాణ పనులు ప్రారంభించిన అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేసేలా ఇంజినీరింగ్ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రామ సచివాలయ వ్యవస్థ బలోపేతానికి అవసరమైన భవన నిర్మాణాలు (ఆర్‌బీకేలు, సచివాలయ భవనాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల భవనాలతో పాటు, గ్రామాల్లోని పేదలకు ఉచితంగా అందించే గృహ నిర్మాణాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీఎంఏవై గ్రామీణ్‌కు సంబంధించి కూడా బిల్లులు, పట్టాల అప్‌లోడ్ కార్యక్రమం వేగంగా చేయాలని ఆదేశించారు. కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్, ఖాశిం పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయుని వార్షిక తిరునాళ్ల



అలంకరణలో పూజలు అందుకుంటున్న వీరాంజనేయస్వామి



వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన భారీ ఎలక్ట్రిక్ ప్రభ

బల్లికురవ: మండలంలోని పెదంబడిపూడి సమీపంలోని చింతతోపులో వేంచేసి ఉన్న వీరాంజనేయ స్వామి 45వ వార్షికి తిరునాళ్ల బుధవారం అంగరంగ వైభవంగా కమనీయంగా జరిగింది. అర్చకుడు గుడిమెళ్ల పవన్‌కుమార్ శాస్త్రిచే ఉదయం 5 గంటలకే గ్రామ పుణ్యాహవచనం, ఖండస్థాపన సహస్ర నామార్చన, తమలపాకులతో అర్చన, ఆకుపూజలు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు స్వామివారి సన్నిధికి చేరి తమతమ మొక్కులు చెల్లించుకున్నారు. అనేక మొక్కుబడి ప్రభలు ఆలయ సన్నిధికి చేరాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. సాయంత్రం కోలాట ప్రదర్శన వైఎస్సార్ సీపీ, టీడీపీ, ఆధ్వర్యంలో రెండు ఎలక్ట్రిక్ ప్రభలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బల్లికురవ ఎస్సై, సీఐలు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా శాంతిభద్రతలు పర్యవేక్షించారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా

బల్లికురవ: ఇంటర్ మొదటి ఫలితాల్లో బాలికలు ముందంజలో ఉన్నట్లు బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ బుధవారం తెలిపారు. మొదటి సంవత్సరం 60 శాతం పాస్, రెండో సంవత్సరంలో 61 శాతం పాస్ సాధించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

మార్టూరు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో స్థానిక రాయల్ జూనియర్ కాలేజీ ఎంపీసీ విద్యార్థిని మండల స్థాయి మొదటి స్థానంలో నిలిచింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో హర్షిణి కళాశాలకు చెందిన కుంచాల మేఘన మండల స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది.

చినగంజాం: కస్తూర్బా బాలికా విద్యాలయం ఇంటర్‌మీడియట్ బాలికలు తమ ప్రతిభ కనబరచినట్లు ప్రత్యేకాధికారి సుమాంజలి వివరాలను వెల్లడించారు. మొదటి సంవత్సరంలో 58.8 శాతం, రెండో సంవత్సరం 55 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ప్రైవేటు విద్యార్థులు కూడా సత్తా చాటారు.

అద్దంకి రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికలు అధిక శాతం ఉత్తీర్ణులై, అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 78 శాతం సాధించినట్లు తెలిపారు.అంబేద్కర్ గురుకులం బాలికల కళాశాలలో మొదటి సంవత్సరం 87.14 శాతం, ద్వితీయ సంవత్సరం 90.76 ఉత్తీర్ణత శాతం సాధించినట్లు ప్రిన్సిపాల్ గాయత్రి తెలిపారు.

చీరాల: చీరాలలోని శ్రీగౌతమి జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. విద్యార్థులను మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, ఏఓ శ్రీనివాసరావు, డైరెక్టర్ కీర్తి వెంకట్రావు, అధ్యాపకులు అభినందించారు. విజ్ఞాన భారతి జూనియర్ కాలేజీ విద్యార్థులు విజయఢంకా మోగించారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ అనిల్ తదితరులు

మార్టూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఆర్బీకే సెంటర్‌లో బుధవారం బొబ్బేపల్లి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి అనిల్ చౌదరి శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో శనగలు క్వింటా ధర రూ. 4600 ఉండగా ప్రభుత్వ మద్దతు ధర రూ. 5335 వంతున కొనుగోలు చేస్తున్నట్లు అనిల్ తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులను సంప్రదించి వారి నివాసాల వద్దే శనగల కొనుగోలు చేస్తున్నామని సీఈఓ కె. మస్తాన్ రావు తెలిపారు. సొసైటీ డైరెక్టర్‌లు అంగిరేకుల ఏడుకొండలు, పెంటేల సుబ్బారావు, కాకోలు వెంకటేశ్వర్లు, తగెడ్ల పెద్ద అంజయ్య, కొనకంచి మురళి, శ్రీను పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థి ప్రతిభ



విజేతతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థి రాష్ట్ర స్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనపర్చి సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణరావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 105 కేజీల విభాగంలో విద్యార్థి జె. చైతన్య గణేష్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎం. వేణుగోపాలరావు, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి పి. హరిణి అభినందించారు.

కొనసాగుతున్న చేనేత రిలే దీక్షలు

వేటపాలెం: మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ నూలుమిల్లు సెంటర్‌లో చేనేత కార్మికులు తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ చేపట్టిన రిలేదీక్షలు మూడో రోజు బుధవారం కొనసాగాయి. చేనేత జన సమాఖ్య నాయకులు మాట్లాడుతూ కార్మికులకు వృత్తి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. నాసిక వెంకట సుబ్బారావు, బొడ్డు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

చందన అలంకరణలో వైష్ణవీమాత

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు నడిబొడ్డున రెండు తాగునీటి చెరువుల మధ్యన కొలువైన శ్రీవైష్ణవీ దుర్గాలయం 22వ వార్షికోత్సవాల ప్రత్యేక పూజలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. స్థానిక వైష్ణవాలయంలో ఉదయం నుంచి ఆలయ ధర్మకర్తలు, ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం చందన అలంకరణలో సిద్ధం చేశారు.

రోడ్డుపై ప్రయాణంలో జాగ్రత్త



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్

చినగంజాం: రోడ్డు పై ప్రయాణం చేసేటప్పుడు యువత తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ కె. సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని పెద గంజాం గ్రామంలో ప్రజలకు అవగాహన కలిగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత రోడ్డు ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిమితికి మించి వేగంగా వాహనాలు నడుపరాదని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. బహిరంగ మద్యం సేవించరాదని, ఆభరణాలు ధరించి నిద్ర పోవద్దని, బ్యాంక్ లాకర్‌లో ఆభరణాలను భద్రపరచు కోవాలని సూచించారు.

కట్టా శ్రీనివాసరావుకు సత్కారం

చీరాల రూరల్: బాపట్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నూతనంగా ఎన్నికయిన న్యాయవాది కట్టా శ్రీనివాసరావును దళిత సంఘాల ఐక్యవేదిక చీరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. జమేడికొండ విద్యాసాగర్, మాచవరపు జూలియస్, చప్పిడి వెంగళరావు, కొండమూడి ప్రకాష్‌లు మాట్లాడారు. చప్పిడి ప్రియతమ్, గూడూరి కిషోర్, రూబెన్, రాజు పాల్గొన్నారు.

నేడు శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

యద్దనపూడి: మండలంలోని జాగర్లమూడి, యద్దనపూడి, పూనూరు గ్రామాల్లో గురువారం సహకార సంఘాల ద్వారా శనగల కొనుగోలు కేంద్రాలను పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ ప్రారంభిస్తున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి. పరిసర గ్రామాల రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగ్గురికి గాయాలు

మార్టూరు: ద్విచక్ర వాహనంపై వెళుతూ బైకు అదుపు తప్పి ముగ్గురు యువకులు గాయపడిన సంఘటన బుధవారం రాత్రి మార్టూరు లో జరిగింది. కొనంకి కి చెందిన బిరుదు సునీల్ తమ కాలనీకి చెందిన దివ్యాంగుడు అయిన బిరుదు బాబు, బిరుదు శ్యామ్‌తో కలిసి బైకు పై మార్టూరు నుంచి కోనంకి వెళుతున్నారు. స్థానిక అమరావతి నూలు మిల్లు సమీపంలో వీరి వాహనానికి మరో వాహనం అడ్డు రావటంతో బైకు అదుపు తప్పి ముగ్గురు యువకులు రోడ్డుపై పడి గాయపడ్డారు. బిరుదు బాబు తలకు తీవ్ర గాయం కాగా మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

భూసార పరీక్షలు తప్పనిసరి

పర్చూరు (చినగంజాం): వేసవిలో భూ సార పరీక్షలు చేయించుకునేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. బుధవారం వ్యవసాయ శాఖ ముందస్తు చర్యలు గురించి శిక్షణ ఏడీఏ మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఏడీఏ మోహనరావు వ్యవసాయాధికారులు రామ్మోహనరెడ్డి, ఆదినారాయణ, వేణుగోపాల్, శివనాగప్రసాద్, హబ్‌ఏఓ సమర్నాథ్, ఏఈఓలు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్



మార్టూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మార్టూరు: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రం మార్టూరులో కన్వీనర్ కుందుర్తి గఫూర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేశారు. ప్రజా సంక్షేమ పథకాలు గురించి, ప్రభుత్వ అభివృద్ధి పథకాలు గురించి, ఆయా కుటుంబాలు పొందిన లబ్ధి గురించి ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, సులేమాన్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్ వలి, ఎస్ఎం బీ రషీద్, కొండ మస్తాన్, ఎంపీటీసీ కరిముల్లా, సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ రఫి, షేక్ కరిముల్లా, బాజీ బాబా, జానీ బాషా, చందుల్లా, ఖైరుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం పుష్యమి నక్షత్రం సప్తమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



కారంచేడులో మాట్లాడుతున్న డాక్టర్ ఉష

కారంచేడు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను అలవర్చుకోవాలని కారంచేడు హోమియో వైద్యాధికారి డాక్టర్ బి. ఉష అన్నారు. బుధవారం కారంచేడు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో మాత్రలు అందించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం సాబీరున్నీసా పాల్గొన్నారు.